
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 8 ఫిబ్రవరి 2024

సమస్యలు గుర్తించి సత్వర పరిష్కారం 8లో..

ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మ దహనం 8లో..



పార్లమెంట్ ఎన్నికలకు కసరత్తు

- పోలింగ్ శాతం పెంపుపై దృష్టి
- బదిలీలకు కసరత్తులు
- జిల్లాలో మూడు సెగ్మెంట్‌లలో ఈవీఎంల పరిశీలన

జగిత్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పకడ్బందీగా పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించడానికి అధికార యంత్రాంగం సమాయత్తం అవుతోంది. ఇందులో భాగంగా జిల్లాలో జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా తయారీతో పాటు ఈవీఎంలను సంసిద్ధం చేయడానికి అధికారులు కసరత్తులు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన మూడు నెలలకే లోక్‌సభ పోరు రానుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంది. నియోజకవర్గ రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఈవీ ఎంల మొదటి దఫా పరిశీలన ఈనెల 5వ తేదీ నుంచి చేపట్టారు. మూడేళ్లుగా జిల్లాలో కొనసాగుతున్న అధికారుల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. దీంతో పాటు సొంత జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పలు కీలక శాఖలకు చెందిన అధికారులను సైతం బదిలీ చేయడానికి జాబితాను సిద్ధం చేశారు. ఒక వైపు ఓటర్ల జాబితా తయారీ, మరోవైపు ఈవీఎంల మొదటి దఫా పరిశీలన, ఇంకొక వైపు అధికారుల బదిలీలకు కసరత్తులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమీక్షలు, సలహాలు, సూచనలు ఇలా పలు ఎన్నికల పనుల్లో అధికారులు బిజీబిజీగా ఉంటున్నారు.

చురుకుగా మొదటి విడత ఈవీఎంల పరిశీలన..

వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవడంలో భాగంగా అధికారులు మొదటి దఫా ఈవీఎంల పరిశీలన కార్యక్రమాన్ని రెండు రోజులుగా చురుకుగా నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వీఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంల పరిశీలన జరుపుతున్నారు. సుమారు పదిరోజుల పాటు ఈవీఎం పరిశీలన ప్రక్రియ జరగనుంది. ఈసీఐఎల్ నుంచి జిల్లాకు వచ్చిన ప్రత్యేక సాంకేతిక నిపుణుల బృందం ఆధ్వర్యంలో పరిశీలన జరుగుతోంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల కోసం వినియోగించిన ఈవీఎంలను జిల్లాలోని వీఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచారు. కళాశాలల్లో వాటి పనితీరును ఇంజనీర్లు పరిశీలిస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు రాజకీయ పక్షాల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీగా ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్నారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 3,973 ఎన్నికల మిషన్లు ఉన్నాయి. ఇందులో 1,677 బ్యాలెట్ యూనిట్లు, 1,020 కంట్రోలు యూనిట్లు, 1,236 వీవీప్యాట్‌లు ఉన్నాయి. వీటిని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఇంజనీర్లు పరిశీలిస్తున్నారు. రెండో, మూడో విడత పరిశీలన కార్యక్రమాలను పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన అనంతరం నిర్వహించనున్నారు.

బదిలీ కానున్న అధికారులు...

జిల్లాలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైంది. శాసనసభ ఎన్నికల సమయంలోనే బదిలీలు జరగవలసి ఉండగా, కేవలం తహసీల్దార్ల వరకే చేపట్టారు. ఈసారి పెద్దఎత్తున బదిలీలు ఉండనున్నాయి. ఒకే చోట మూడేళ్లు పైబడిన జిల్లా ఆవిర్భావం నుంచి ఇక్కడే పాతుకుపోయిన ఉద్యోగుల వివరాలతో నివేదికను ప్రభుత్వానికి పంపించారు. ఆయా శాఖల జిల్లా అధికారులతో పాటు డీఆర్డీవో, పంచాయతీరాజ్, రెవెన్యూ, ఎక్సైజ్ తదితర శాఖల్లో బదిలీలు జరుగనున్నాయి. పంచాయతీరాజ్‌శాఖలో ఎంపీవోలు, ఎంపీడీవోల బదిలీలు ఉండనున్నాయి. సొంత జిల్లాలో పనిచేసే తహసీల్దార్లకు సైతం స్థానచలనం కల్పించనున్నారు. డిప్యుటేషన్లపై వచ్చిన వారిని వెనక్కి పంపడానికి సైతం అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకు అవసరమైన ప్రత్యేక జాబితాను అధికారులు సిద్ధం చేశారు.

పోలింగ్ శాతం పెంపుపై దృష్టి..

ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్‌లో 76.60 శాతం ప్రజలు ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో 6,99,203 మొత్తం ఓటర్లుండగా ఇందులో పురుషులు 3,37,919 మంది, మహిళలు 3,61,254 మంది, ఇతరులు 30 మంది ఉన్నారు. జిల్లాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో 5,35,995 మంది మొత్తం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో పురుషులు 2,42,840 మంది, మహిళలు 2,93,140 మంది, ఇతరులు 15 మంది ఓటు వేశారు. జిల్లాలో పురుషుల కంటే మహిళలే పోలింగ్‌లో ఎక్కువగా భాగస్వామ్యం అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం పోలింగ్ శాతం పెంచేలా చర్యలు చేపట్టడం మొదలు పెట్టారు. జగిత్యాలలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఈవీఎం అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరును సిబ్బంది వివరిస్తున్నారు. మరోవైపు ఓటరు జాబితా సవరణ జరుగుతోంది. తుది జాబితాను వెలువరించడానికి సిద్ధమవుతున్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ మండలంలోని ఇటిక్యాల అంబేద్కర్ విగ్రహం నుంచి ఒడ్డెర కాలనీ వరకు సీసీ రోడ్డు, ఒడ్డెర కాలనీ నుంచి ఇటిక్యాల జూనియర్ కళాశాల వరకు కోటి 50 లక్షల రూపాయలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను బుధవారం ఎమ్మెల్సీ ప్రారంభించారు. అనంతరం మండలంలోని అల్లీపూర్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న భీంరెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాబోయే రాష్ట్ర బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి తగిన నిధులను కేటాయించాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావుకు టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు. హైద్రాబాద్‌లోని సచివాలయంలో వేణుగోపాల్‌రావును కలిసి సమస్యలను విన్నవించారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే మార్చిలో గల్ఫ్ దేశాల్లో పర్యటించాలని కార్మికులు కోరుతున్నారని వివరించారు. సమగ్ర ఎన్ఆర్ఐ పాలసీతో కూడిన గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.

- ఇటీవల ప్రభుత్వ సలహాదారుగా నియామకమైన హర్కార వేణుగోపాల్ రావును బుధవారం ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహ నాయుడు ఘనంగా సన్మానించారు. హైద్రాబాద్‌లోని సెక్రటేరియట్ కార్యాలయంలో వేణుగోపాల్ రావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గంగుల మురళీధర్ రెడ్డి, గల్ఫ్ కార్మిక జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల డేటా సేకరణకు సహకరించాలి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 7: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగిత్యాల మున్సిపల్ పరిధిలో చేపట్టనున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల డెటాను జీఐఎస్ సిస్టమ్ ద్వారా సేకరించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మున్సిపల్ పరిధిలో ఉన్న అన్నిరకాల ఆస్తుల వివరాలు, రోడ్లు, డ్రైనేజీలు, డిజిటల్ డోర్ నంబర్స్ అమలులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. డేటాను సేకరించేందుకుగాను ప్రభుత్వం ఎంఎస్ టెక్నాలజీస్ అనే సంస్థకు అప్పగించిందని పేర్కొన్నారు. సంస్థ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

దూరవిద్య పరీక్ష ఫీజు గడువు 21

మల్యాల, ఫిబ్రవరి 7: దూరవిద్యలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులు ఈ నెల 12 నుంచి 21 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోతె శివరామకృష్ణ కోరారు. 22 నుంచి 27 వరకు రూ.25 అపరాధ రుసుముతో, 28 నుంచి మార్చి 4 వరకు రూ.50 అపరాధ రుసుముతో కూడా ఫీజు చెల్లించవచ్చునని పేర్కొన్నారు. గతంలో పరీక్షలు ఫెయిల్ అయిన వారు కూడా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

రాయికల్, ఫిబ్రవరి 7: పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను చెల్లించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ సంతోష్ కుమార్‌కు బుధవారం బీజేపీ ఫ్లోర్ లీడర్ కల్లెడ సునీత బుధవారం వినతిపత్రం అందజేశారు. 2021-22 వరకు మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు ఖర్చు చేసిన డీజిల్, పెట్రోల్ బిల్లులు, హరితహారం నిధులు, టీయూఎఫ్ఐసీసీ నిధుల నుంచి చెల్లించిన చెక్కుల వివరాలు, బోర్ల వివరాలు, నీటి సంపుల నిర్మాణ బిల్లులు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, నాయకులు కురుమ మల్లారెడ్డి, గంట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

రాయికల్, ఫిబ్రవరి 7: మండలంలోని రామాజీపేట ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థి, కాంగ్రెస్ గ్రామ యూత్ అధ్యక్షుడు కండ్లపెల్లి సాయి కుమార్ బుధవారం పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్‌లను అందజేశారు. దాతను ప్రధానోపాధ్యాయులు గజ్జెల నరేందర్, తాజా మాజీ ప్రతినిధులు బెజ్జంకి మోహన్, జకిలేటి హరీష్ రావు, ఆర్‌యూపీపీటీ జగిత్యాల జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి వేల్పుల స్వామి యాదవ్, తెనుగు రమేష్, తంగళ్లపెల్లి సతీష్, విజయ్, బూసి రమ, అంజుం బేగం, మైస శేఖర్ అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

పెగడపల్లి, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో గావ్ చలో పల్లెకు పోదాం పేరుతో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, గ్రామాలకు నేరుగా ఇస్తున్న నిధులు తదితర విషయాలు వివరిస్తూ ఇంటింటికి కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగుల కొమురెల్లి, బతికెపల్లి ఎంపీటీసీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చింతకింది అనసూర్య, నాయకులు మోహన్‌రెడ్డి, గట్టయ్య, కిషోర్, రాజేషం తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా కార్యవర్గానికి సన్మానం

కోరుట్ల, ఫిబ్రవరి 7: ఇటీవల ఎన్నికైన జిల్లా ట్రస్మా కార్యవర్గంను బుధవారం కోరుట్ల ట్రస్మా సంఘ సభ్యులు సన్మానించారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ట్రస్మా కార్యవర్గం బండి మహదేవ్, బ్రహ్మన్నగారి శంకర్ శర్మ, ఎంఏ బారీ, ఆకుల రాజేష్, నగునూరి గంగాధర్, కుందారపు మహేందర్, రమేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ ట్రస్మా సంఘ సభ్యులు తుమ్మన్నపల్లి సత్యనారాయణ, చౌకి రమేష్, కూడెలు రాజేంద్రప్రసాద్, సిద్దార్థ, బాలాజీ దామోదర్, దీపక్, నాగభూషణం, శ్రీధర్, సతీష్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల లబ్ధిదారులను తప్పుదోవ పట్టిస్తున్న ఎమ్మెల్సీ

- ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని నూకపల్లి వద్ద నిర్మాణమవుతున్న కేసీఆర్ కాలనీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గతంలో ఎన్నడూ సందర్శించని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి ఇటీవల రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం సందర్శించి లబ్ధిదారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సరాల తరబడి జగిత్యాల పట్టణ అభివృద్ధిని పట్టించుకోని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని పలు ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారని వివరించారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు రానున్న నేపథ్యంలో నిరుపేదలకు ఇళ్ల పేరిట ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోనే నియోజకవర్గంలోని నూకపల్లి వద్ద అత్యధికంగా నిర్మాణమవుతున్న కేసీఆర్ కాలనీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గతంలో ఎన్నడూ సందర్శించని ఎమ్మెల్సీ రెండు రోజుల క్రితం రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం సందర్శించి లబ్ధిదారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ సర్కారు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను బీఆర్ఎస్ సర్కారు నిలిపివేసిందని కాంగ్రెస్ నేతలు అనడాన్ని తీవ్రంగా ఖండించారు. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సీసీ రోడ్లు, సెప్టిక్ ట్యాంక్, మరికి కాలువల నిర్మాణానికి అప్పటి మంత్రి కేటీఆర్ రూ. 25 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. కరోనా కారణంగా కొన్ని నెలల పాటు పనులు నిలిచిపోయాయని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన అనంతరం కేసీఆర్ కాలనీలో పనులల్లో జాప్యం ఏర్పడడంతో ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలను విన్నవించానన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో సుమారు 800 ఇళ్లు పంపిణీ చేయకుండా మిగిలి ఉన్నాయని తెలిపారు. అర్హులైన పేదలకు వాటిని కేటాయించాల్సిన అవసరముందన్నారు. కేసీఆర్ కాలనీలో సుమారు 520 ఇళ్లకు అవసరమైన రోడ్డు కోసం గతంలో ఓ దాత ఇచ్చిన భూమి ప్రస్తుతం ఆక్రమించుకున్నాడని, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు ఇళ్లు అందించడానికి రాజకీయాలకతీతంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో జగిత్యాల మున్సిపల్ ఇంచార్జీ చైర్మన్ గోలి శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, నాయకులు ఒల్లెం మల్లేశం, బొడ్ల జగదీశ్, జుంబర్తి రాజుకుమార్, అల్లె గంగాసాగర్, సింగారావు, అలువాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న ఆదాయానికి గండి

- కుమ్మక్కైన తలనీలాల కాంట్రాక్టర్లు
- రూ.2 కోట్ల మేర తగ్గిన ఆదాయం

మల్యాల, ఫిబ్రవరి 7: తలనీలాల కాంట్రాక్టర్లు కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఆదాయానికి గండి కొట్టారు. దీంతో గతం కంటే దాదాపు రెండు కోట్ల రూపాయల మేర నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో ధరల లేమి నేపంతో కుమ్మక్కైన వ్యాపారులు దేవస్థానం తరుపున గతంలో ఆరుసార్లు టెండర్లు నిర్వహించగా మరోసారి వాయిదా వేయకుండా తక్కువకే అప్పగించేందుకు సిద్ధం అవడం సర్వాత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దేవస్థానం పరిధిలో జనవరి నుంచి వచ్చే డిసెంబరు వరకు ఏడాది కాలపరిమితికి గాను అధికారులు కొన్ని రోజులుగా సీల్డ్, ఆన్‌లైన్, బహిరంగ టెండర్లు నిర్వహిస్తున్నారు. అయితే వ్యాపారులు ముందుకు రాకపోగా వారం రోజుల క్రితం నిర్వహించినప్పుడు ఏడాదికి గాను రూ.1.61కోట్లు పలుకగా క్రితం సారి టెండర్ రూ.3.65కోట్లు ఉందని వాయిదా వేశారు. అయితే బుధవారం ఏడో సారి నిర్వహించగా కె వెంకటనర్సమ్మ 1.62 కోట్లు రూపాయల హెచ్చు పాటగా ఉండడంతో కమిషనర్‌కు నివేదించారు. కమిషనర్ ఆదేశాల మేరకు టెండర్ ఖరారు చేయాల్సి ఉంటుందని దేవస్థానం అధికారులు తెలిపారు. అయితే కాంట్రాక్టర్లు కుమ్మక్కై దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బుధవారం కూరగాయలు, పాలు, పెరుగు, పూలు,పండ్లు, వస్త్రములు, ప్రింటింగ్, శానిటేషన్, స్టేషనరీకి కూడా అధికారులు టెండర్లు ఖరారు చేశారు. కార్యక్రమంలో ఈవో వెంకటేష్, ఏసీ చంద్రశేఖర్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బి శ్రీనివాస్

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 7: జగిత్యాల జిల్లా డీసీఆర్‌బీ (డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో) ఇన్‌స్పెక్టర్‌గా బి శ్రీనివాస్ ఇటీవల నియమితులయ్యారు. బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ సన్ ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

మల్యాల, ఫిబ్రవరి 7: మండంలోని కొండగట్టుకు చెందిన బండల్ల అజయ్ మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా బుధవారం నిర్వహించిన యువకుని అంత్యక్రియల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ముత్యం శంకర్, కొలకాని మారుతీ తదితరులు ఉన్నారు.

వైజ్ఞానిక మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

రాయికల్, ఫిబ్రవరి 7: మండలంలోని తాట్లవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ రెండవ రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్నామని, ఈ సభల్లో అంతరాలు లేని విద్య, ప్రజల హక్కు-ప్రభుత్వ బాధ్యత, అసమాన సమాజంలో సమానత్వ విద్య-సాధ్యాసాధ్యాలు, ఫాసిజం-బుద్ధి జీవుల పాత్ర, మహిళ స్థితిగతులు-కర్తవ్యాలులాంటి అంశాలపై ప్రముఖ వక్తలు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, ప్రొఫెసర్ కోదండ రామ్, విమలక్క తదితరులు హాజరవుతురని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యాభిమానులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, లావణ్య, సాగరిక, శ్రీధర్, శ్రీదేవి, చంద్రకళ, రవి కుమార్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

మల్యాల సింగిల్‌విండో చైర్మన్‌పై అవిశ్వాసం



అవిశ్వాస నోటీస్ అందజేస్తున్న డైరెక్టర్లు

మల్యాల, ఫిబ్రవరి 7: మల్యాల సింగిల్‌విండో చైర్మన్ ఎం రాంలింగారెడ్డిపై వైస్ చైర్మన్ మ్యాక బుజ్జమ్మతో పాటు మరో ఆరుగురు డైరెక్టర్లు బుధవారం జిల్లా సహకార అధికారికి అవిశ్వాస నోటీస్ అందజేశారు. అధికారులు అవిశ్వాసంపై సమావేశం ఏర్పాటు చేసినప్పుడు తొమ్మిది మంది డైరెక్టర్లు అవసరం కాగా అవిశ్వాస నోటీస్‌పై 7గురు డైరెక్టర్లతో పాటు ఇద్దరు సంఘ సభ్యులు సంతకాలు చేశారు. దీంతో ఇద్దరు సభ్యులను మినహాయిస్తే అవిశ్వాసం నెగ్గడానికి మరో ఇద్దరు డైరెక్టర్లు అవసరం పడుతుంది. కాగా అవిశ్వాస నోటీస్ అందజేసిన వారిలో వైస్‌చైర్మన్ మ్యాక బుజ్జమ్మ డైరెక్టర్లు సంత ప్రకాష్‌రెడ్డి, యాల్ల అనంతరెడ్డి, ఓరుగంటి రాజేందర్‌రెడ్డి, ఉత్తూరి తిరుమలేష్, అడువాల సురేష్, ఆకుల నగేష్, సంఘ సభ్యులు మ్యాక లక్ష్మణ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 7: మహిళ సంఘాల ఆర్థిక అభివృద్ధి దిశగా నడిచి మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని డీఆర్‌డీఓ పీడీ నరేష్ అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల వీఈఏల రివ్యూ సమావేశం, శిక్షణ తరగతుల్లో అడిషనల్ డీఆర్‌డీవోలు సుధీర్, బాలె శివాజీ, డీపీఎం వెంకటేష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ లింకేజీల వివరాలను సంఘ సభ్యులకు వివరించారు. మహిళలకు ఎక్కువ మొత్తంలో ప్రభుత్వాలు రుణాలు అందిస్తూ ఆర్థికంగా ఎదిగే విధంగా చొరవ చూపుతుంబబదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో రాణించిన మహిళ సంఘ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం శంకర్, ఆశోక్, దాసు, మహిళ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేద్కర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సోగాల కుమార్, నాయకులు

ధర్మపురి, ఫిబ్రవరి 7: దళిత వర్గాల అణచివేతకు నిరసనగా ఆత్మగౌరవం కోసం తన ప్రాణ త్యాగం చేసిన మహనీయురాలు రమాబాయి అంబేద్కర్ అని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి సోగాల కుమార్ అన్నారు. ధర్మపురి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ, ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో మాతా రమాబాయి జయంతి వేడుకలు వేర్వేరుగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోగాల కుమార్, బీఎస్‌పి నాయకులు పారుపెల్లి రాజమల్లయ్య, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షులు చందోళి శ్రీనివాస్, బీజేపీ, బీజేవైఎం, ఎంఆర్‌పీ, ఎంఎస్‌పీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహానికి, రమాబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సోగాల కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి తాను జీవించి ఉన్న 36 ఏళ్ల కాలంలో దేశ దళిత వర్గాల కోసం ఎనలేని కృషి చేశారన్నారు. అంబేద్కర్‌కు సగ భాగమై అండగా నిలవడం ఆమె ఆత్మస్థైర్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. రమాబాయి సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు.

కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం, కో కన్వీనర్ బందారి లక్ష్మణ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొనకొండ నరేష్, ఎంఆర్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అరికిల్ల సతీష్, పట్టణ అధ్యక్షులు పులి ప్రేమిత్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, నేతలు ఆకుల శ్రీనివాస్, తిరుమన్‌దాస్ సత్యనారాయణ, పల్లెర్ల సురేందర్, హరీష్, సూరజ్, అనిల్, శ్రీనివాస్, సురేష్, మల్లేశం, పారుపెల్లి లక్ష్మణ్, మోతె ప్రభాకర్, బరిగెల ప్రసాద్, బొల్లారపు పోచయ్య, చిలుముల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

- **గొల్లపల్లి:** మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి నర్సాపురం రవీందర్, అంకం భూమన్న, కొంద్ర తిరుపతి, గంగాధర మధుసూదన్, గుండా ప్రశాంత్, చెవులమద్ది అజయ్, తుడుం వెంకటేష్, జేరిపోతుల అంజి బాబు, తుడుం కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పేరుతో పేదలకు కుచ్చుటోపీ

● రూ.కోటిన్నరకు పైగా వసూలు ● ఏడుగురిపై కేసు.. ఇద్దరి అరెస్టు

ముస్తాబాద్, ఫిబ్రవరి 7: పేదలకు ఇళ్లు కట్టిస్తామన్న ఓ స్వచ్ఛంద సంస్థ వారికి కుచ్చుటోపీ పెట్టింది. ముస్తాబాద్ మండలం మోయినికుంట, మద్దికుంట, మోర్రాయిపల్లె గ్రామాల్లో సిటిజన్స్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ అనే స్వచ్ఛంద సంస్థ డబల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని వసూళ్లకు పాల్పడింది. ఐదేళ్ల క్రితం మూడు గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థ తరఫున ఇళ్లు కట్టించేందుకు లబ్ధిదారుడు వాటా చెల్లించాలని పేర్కొంది. దీంతో మూడు గ్రామాల్లోని పేదలు రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు అప్పు చేసి ప్రతినిధుల చేతిలో పెట్టారు. గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పేదల నుంచి డబ్బులు తీసుకొని ఒప్పందం చేసుకున్నారు. 2020సంవత్సరంలో జరిగిన ఒప్పందంలో లబ్ధిదారుడి వాటా రూ.3.50 లక్షలు చెల్లించాలని, మరో ఆరున్నర లక్షలు సంస్థ ద్వారా చెల్లించేందుకు అంగీకరించారు. కొంత మంది లబ్ధిదారులకు సంస్థ రాయి, సిమెంట్ స్టీలు పంపించి బెస్‌మెంట్ వరకు పనులు చేపట్టారు. రోజులు గడుస్తున్న పనులు పూర్తి కాకపోవడంతో సంస్థ ప్రతినిధులను సంప్రదించగా స్పందించలేదు. మూడు గ్రామాల్లో దాదాపు వంద మందికి పైగా లబ్ధిదారులు రూ. కోటిన్నర చెల్లించినట్లు భావిస్తున్నారు. మద్దికుంట, మొర్రాయిపల్లె, మోయినకుంట గ్రామాల్లో కొంతమందికి చెల్లిం చిన డబ్బుల మట్టుకు ఇంటి నిర్మాణ ముడి సరుకు అందినట్లు తెలిపారు.

ఠాణాను ఆశ్రయించిన బాధితులు

డబ్బులు చెల్లించలచినా పనులు మొదలు పెట్టకపోవడంతో ఆందోళన చెందిన లబ్ధిదారులు కొంత మంది పోలీసులను ఆశ్రయించారు. 2022లోనే మోయినికుంట, మద్దికుంట, మోర్రాయిపల్లెకు చెందిన బాధితులు ముస్తాబాద్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు సంస్థ ప్రతినిధులు కె వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరెడ్డి, మరో నలుగురిపై సోమవారం కేసు నమోదు చేశారు. అదేరోజు శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరాజును రిమాండ్‌కు తరలించారు. మూడు గ్రామాల్లో ఇళ్లు నిర్మిస్తామని స్వచ్ఛంద సంస్థ పేదల వద్ద భారీ వసూళ్లకు పాల్పడి మోఖం చాటేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న కారు

● ఇద్దరి మృతి.. ఒకరి పరిస్థితి విషమం

శంకరపట్నం, ఫిబ్రవరి 7: శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామంలో కరీంనగర్-వరంగల్ హైవేపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కరీంనగర్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న కారు కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న హనుమకొండకు చెందిన తాళ్లపల్లి కొంరమ్మ(68), కరీంనగర్‌కు చెందిన నీర్ల ప్రభాకర్ (58)లు అక్కడికక్కడే మృతి చెందారు. తాళ్లపల్లి సదానందం, తాళ్లపల్లి గీతలకు తీవ్ర గాయాలయ్యాయి. గీత పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడు ప్రభాకర్ భార్య సబిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆగి ఉన్న టిప్పర్‌కు పార్కింగ్ లైట్లు వేయక పోవడంతోనే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

రూ.6,650 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 7: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,650 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 82మంది రైతులు 758క్వింటాళ్ల విడి పత్తి, 13మంది రైతులు 19క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,650, కనిష్ఠ ధర రూ.5,500 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 7:దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరికి ఎనిమిది నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ పెద్దపల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని బసంత్‌నగర్ ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత ఏడాది సెప్టెంబర్ ఒకటిన పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ శివారులో గల హన్‌మాన్ దేవాలయంలో హుండీ పగలకొట్టి అందులో గల ఇరవై వేల రూపాయల నగదు దొంగిలించారు. దర్యాప్తులో హన్మకొండకు చెందిన పాశం ప్రణీత్, ఉమర్ ఫరూక్ చోరీకి పాల్పడినట్లు తేలింది. అప్పటి ఎస్ఐ గంగరాజు గౌడ్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులకు ఎనిమిది నెలల కఠిన కారాగార శిక్ష విధించారు. కేసును ప్రస్తుత బసంత్‌నగర్ ఎస్ఐ వెంకటేశ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాకేష్ ఆధ్వర్యంలో కోర్టు పీసీ సంజయ్ కేసును ట్రయల్ నడిపించారు.

ఆచంపల్లి గ్రానైట్ ఫ్యాక్టరీలో చోరీకి యత్నం

గంగాధర, ఫిబ్రవరి 7: గ్రానైట్ ఫాక్టరీలో బుధవారం వేకువ జామున ఆరుగురు గుర్తు తెలియని మహిళలు చోరీకి యత్నించారు. గంగాధర మండలం ఆచంపల్లిలోని గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలో వేకువ జామున సిబ్బంది నిద్రిస్తున్న సమయంలో కొందరు మహిళలు చోరీకి ప్రయత్నించారు. గ్రానైట్ కటింగ్ మిషన్‌కు నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన 10 హెచ్‌పీ మోటర్ల విద్యుత్ తీగలను కత్తిరించారు. ఇదే సమయంలో శబ్దం రావడంతో ఫ్యాక్టరీ సిబ్బంది కేకలు వేశారు. సుమారు ఆరుగురు మహిళలు ఆటోలో పారిపోతుండగా ఫ్యాక్టరీ సిబ్బంది ద్విచక్రవాహనాలపై వెంబడించి కొత్తపల్లి మండలం నాగుల మల్యాల వద్ద వారిని పట్టుకున్నారు. మహిళలు మానకొండూరు మండలానికి చెందిన వారిగా తెలిసింది. సిబ్బంది అప్రమత్తతతో గ్రానైట్ ఫ్యాక్టరీ పెద్ద మోటర్లను కాపాడగలిగారు. దీనిపై ఎస్ఐ అభిలాష్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

డబ్బులు ఇవ్వాలని బెదిరించిన వ్యక్తి రిమాండ్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: సిరిసిల్ల పట్టణం చంద్రంపేటకు చెందిన రమణారెడ్డిని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ ఉదయ్‌రెడ్డి బుధవారం తెలిపారు. రమణారెడ్డి భూ తగాదాల్లో మధ్యవర్తిత్వం చేస్తూ డబ్బులు, భూమి డిమాండ్ చేసేవాడని పేర్కొన్నారు. చంద్రంపేటకు చెందిన రాజు అనే వ్యక్తిపై హత్యాప్రయత్నం చేసిన సంఘటనతో పాటు అతడిపై మరో నాలుగు కేసులు నమోదయ్యాయని తెలిపారు. దర్యాప్తులో భాగంగా రమణారెడ్డి కోసం గాలిస్తుండగా కోర్టులో లొంగిపోయాడని, మెజిస్ట్రేట్ రిమాండ్‌కు తరలించారని పేర్కొన్నారు. తన భూ సమస్య పరిష్కారానికి రమణారెడ్డిని సంప్రదించగా సెటిల్‌మెంట్ చేస్తానని చెప్పి రూ.3లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా రూ.1లక్ష అడ్వాన్స్‌గా తీసుకొని భూసమస్య పరిష్కారం చేయలేదని, అయినప్పటికీ మిగితా రూ. 2లక్షలు ఇవ్వాలని ఒత్తిడిచేశాడని లేదంటే 100గజాల స్థలం రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరించడమే కాకుండా ఈ నెల 5న వేములవాడకు వెలుతుండగా తనపై హత్యాప్రయత్నం చేశాడని బాధితుడు చంద్రంపేటకు చెందిన తుంగ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

రాయికల్, ఫిబ్రవరి 7: రాయికల్ పట్టణానికి చెందిన దాసరి చిన్న నర్సయ్య (70) జ్ఞాపకశక్తి కోల్పోయి ఈ నెల 4న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం మధ్యాహ్నం చిన్ననర్సయ్య మృతదేహం రాయికల్ గ్రామ శివారులోని జన్మయి చెరువులో లభ్యమైంది. చిన్న నర్సయ్య మతిస్థిమితం సరిగా లేక ప్రమాదవశాత్తు నీటిలో పడి చనిపోయాడని అతని భార్య దాసరి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

రాజన్న వసతి గదుల బుకింగ్ కంప్యూటరీకరణ

వేములవాడ, ఫిబ్రవరి 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం వసతి గదులను ఆలయ అధికారులు కంప్యూటరీకరించారు. ఇప్పటి వరకు ఆలయ వసతి గదుల కేటాయింపును ఉద్యోగులు మ్యానువల్‌గా చేసేవారు. ఇకపై కంప్యూటర్ ద్వారా వసతి గదులను కేటాయించడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. వసతి గదుల కేటాయింపు విషయంలో ఆలయ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్న తరుణంలో రాష్ట్రంలోని ఇతర ఆలయాల తరహాలో వసతి గదుల కేటాయింపును కంప్యూటర్ ద్వారా చేసేందుకు నిర్ణయించడంతో సామాన్య భక్తులకు సైతం గదులు సులభంగా లభించే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. వసతి గది కోసం వచ్చే యాత్రికుడు తప్పనిసరిగా విచారణ కార్యాలయానికి వచ్చి ఫొటో గుర్తింపు కార్డుతో పాటు స్వామి వారి అద్దె గదిలో ఉండే వారి వివరాలను వెల్లడిస్తే కంప్యూటర్‌లో నమోదు చేసి గది అద్దె మొత్తం, అడ్వాన్సు చెల్లించిన తర్వాత గది కేటాయిస్తారు. 24 గంటల్లో వసతి గది ఖాళీ చేయని యాత్రికుడికి సంబంధించి అడ్వాన్స్ మొత్తాన్ని తదుపరి అద్దె కింద జప్తు చేస్తారు. వసతి గదుల కంప్యూటరీకరణ ద్వారా ఆలయంలోని ఏఏ వసతి సముదాయంలో ఎన్ని గదులు ఖాళీ ఉన్నాయని వాటిపైన సైతం సంబంధిత సిబ్బందికి స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. ఇదిలా ఉండగా భీమేశ్వర సదన్, పార్వతిపురం వసతి సముదాయాలకు అదనపు కౌంటర్‌ను ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆలయ అధికారులు తెలిపారు. టి యాప్ ద్వారా ముందస్తు బుకింగ్ సౌకర్యం.. రాజన్న సన్నిధికి వచ్చే భక్తులు వసతి గదులను ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకునేందుకు టి యాప్ పోలియో యాప్, మీసేవ పోర్టల్ అవకాశం కల్పించారు. వసతి గదుల బుకింగ్‌తో పాటు శ్రీస్వామి వారి ఆర్జిత సేవలకు సంబంధించిన పూజల టికెట్లను ముందస్తుగా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా రాజన్న ఆలయ వసతి గది బుక్ చేసుకోవాలనుకునేవారు కనీసం వారం రోజులు ముందుగా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రస్తుతం నందీశ్వర వసతి గదుల సముదాయంలో 112 నాన్ ఏసీ గదులు, 55 ఏసీ గదులు, 8 సూట్లు ఉండగా, లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో 98 నాన్ ఏసీ గదులు, పార్వతీపురంలో 110 నాన్ ఎసి గదులు, భీమేశ్వర సదన్ 56 ఏసీ గదులు, 4 సూట్లు, 4 గెస్ట్ హౌస్‌లు, అమ్మవారి కాంప్లెక్స్‌లో 4 ఏసీ గదులు అందుబాటులో ఉన్నాయి.



వేములవాడలో వసతి గదుల విచారణ కార్యాలయం

రాజన్న హుండీ ఆదాయం రెండు కోట్ల 15 లక్షలు

వేములవాడ, ఫిబ్రవరి 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా రెండు కోట్ల పదిహేను లక్షలకు పైచిలుకు ఆదాయం సమకూరింది. గత 14 రోజుల వ్యవధిలో భక్తులు శ్రీ స్వామివారి హుండీలలో సమర్పించిన కానుకలను ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా 2 కోట్ల 15 లక్షల 67 వేల 130 రూపాయల నగదు, 71 గ్రాముల 500 మిల్లి గ్రాముల బంగారం, 13 కిలోల 600 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ తెలిపారు.

వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 7: కరీంనగర్‌లో వాణిజ్య పన్నులశాఖ కార్యాలయ భవన నిర్మాణానికి 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని అధికారులు, ఉద్యోగులు కోరారు. బుధవారం ఉమ్మడి జిల్లా వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సిహెచ్.రవికుమార్, తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. ముజాహిద్‌హుస్సేన్, కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు గుంటి భిక్షపతి ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

కోతుల దాడిలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో బుధవారం కోతులు దాడిలో అదే గ్రామానికి చెందిన వృద్ధుడు అలివేలి నారాయణ తీవ్ర గాయాలపాలయ్యాడు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నారాయణ తన ఇంటి నుంచి బస్టాండు వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా నాలుగు వానరాలు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచాయి. పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. కాగా గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇళ్లలోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గ్రామంలో కోతుల బెడదను నివారించాలని కోరుతున్నారు.

మేడారం జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఆర్‌ఎం

భగత్‌నగర్, ఫిబ్రవరి 7: సమ్మక్క సారలమ్మ మేడారం జాతరకు కరీంనగర్ బస్టాండ్‌లో బస్సుల పాయింట్ల ఏర్పాట్లను బుధవారం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎస్ సుచరిత పరిశీలించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణానికి అవకాశం ఉన్నందున మేడారం జాతరకు భక్తులతాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌక్యం కలగకుండా తాగు నీరు, ఇతర మౌళిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. కరీంనగర్-1, 2డిపోల్లో ఇతర డిపోల నుంచి వచ్చే ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను పరిశీలించారు. ప్రయాణికులకు చల్లని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని బస్‌స్టేషన్ మేనేజర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ రీజినల్ మేనేర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, డిప్యూటీ ఆర్‌ఎం మెకానికల్ కె సత్యనారాయణ, డిపో మేనేజర్లు ఎల్‌మల్లేశం, విమల్లయ్య, రజనీకృష్ణ, వీరస్వామి, నజీర్ ఉన్నారు.


బస్టాండ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం సుచరిత

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: సిరిసిల్ల పట్టణంలోని సిద్ధార్థనగర్‌లో రాగుల స్రవంతి అలియాస్ లాస్య(30) అనే వివాహిత అదనపు వరకట్న వేధింపులకు బలైంది. భర్త, అత్తలు అదనంగా రూ.10 లక్షలు వరకట్నం ఇవ్వాలని గత కొంతకాలంగా వేధిస్తుండటంతో ఆత్మహత్యకు పాల్పడింది. సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన స్రవంతిని ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన రాగుల నాగరాజుతో ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో రూ.20 లక్షల వరకట్నం, ఇతర లాంచనాలు ఇచ్చారు. వీరికి అయిదేళ్ల కూతురు, రెండేళ్ల బాబు ఉన్నారు. స్రవంతి బీటెక్ పూర్తిచేయగా భర్త నాగరాజు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సర్దాపూర్ 17బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరు సిద్దార్థనగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం స్రవంతి వాంతులు చేసుకోవడంతో అనుమానం వచ్చిన భర్త స్థానిక ఆస్పత్రికి చికిత్స కోసం తరలించాడు. పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో హైద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా రాత్రి మృతిచెందింది. భర్త నాగరాజు అదనంగా రూ. 10లక్షల వరకట్నం తీసుకురావాలని వేధించడంతో పాటు బాబు పుట్టేంత వరకు అబార్షన్ చేయించాడని, తల్లిదండ్రుల మాటలు వింటూ భార్యను హింసించేవాడని దీనితోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్రవంతి పురుగుల మందు తాగి ఉంటుందని పోలీసులు భావి స్తున్నారు. ఈ సంఘటనపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసి మృతదేహానికి పంచనామా అనంతరం పోస్టు మార్టం కోసం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. కాగా తల్లి మృతితో ఇద్దరు చిన్నారులు విలపించడం విషాదం నింపింది.


స్రవంతి (ఫైల్)

భర్తపై కేసు నమోదు

స్రవంతి మృతి కేసులో కానిస్టేబుల్ అయిన భర్త నాగరాజు, అతని తల్లిపై 304బి సెక్షన్ కింద కేసు నమోదు చేశామని టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. ఈ కేసులో నాగరాజును అరెస్ట్ చేశామని గురువారం రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో దొంగల చేతివాటం

- జేబులు కట్ చేసి నగదు, ఫోన్లు అపహరణ

ధర్మపురి, ఫిబ్రవరి 7: ధర్మపురి పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరైన కొందరు నాయకుల జేబులు కట్ చేసి నగదు, మొబైల్ ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అపహరించారు. సమావేశం ముగిసిన తరువాత కార్యకర్తలు భోజనం చేసేందుకు వెళ్లే సమయంలో ఫంక్షన్ హాల్ రద్దీగా మారింది. ఆ సమయంలోనే జేబులు కత్తిరించి పర్సులు, మొబైల్ ఫోన్లు అపహరించారు. పాక వెంకటేషం వద్ద నుంచి రూ.12,000, కోఆప్షన్ మెంబర్ ఎండీ అలీ మొబైల్ ఫోన్, బొల్లె భగత్ కుమార్ వద్ద రూ.4,000, రాచకొండ ఆనంద్ వద్ద రూ 5,500, కాశెట్టి వీరేశం నుంచి రూ. 18,000, మరి కొందరు వ్యక్తుల నగదు, మొబైల్ ఫోన్లు అపహరించారు. ఫంక్షన్ హాల్ సీసీ కెమెరాల ఆధారంగా చోరీలకు పాల్పడ్డ వ్యక్తులను పట్టుకోవాలని కోరుతున్నారు.

మాజీ నక్సలైట్‌పై పీడీ యాక్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: వేములవాడ పట్టణం తిప్పాపూర్‌కు చెందిన మాజీ నక్సలైట్ మానుక కుంటయ్య(45)పై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్‌ల ఆదేశాల మేరకు పీడీయాక్ట్ అమలు చేస్తూ ఆ ఉత్తర్వులను అందజేసి బుధవారం చర్లపల్లి జైలుకు తరలించినట్లు టౌన్ సిఐ కరుణాకర్ తెలిపారు. తిప్పాపూర్‌కు చెందిన కుంటయ్య గతంలో జనశక్తి అనే తీవ్రవాద గ్రూపులో పనిచేసి ఆ తర్వాత లొంగిపోయి భూ సమస్యలపై జోక్యం చేసుకుంటూ యజమానులను బెదిరిస్తూ వారి నుంచి డబ్బు వసూలు చేసేవాడని తెలిపారు. మానుక కుంటయ్య నేర కార్యకలాపాలను నిరోధించడానికి జిల్లా పరిధిలో భూ సంబంధించిన విషయాల్లో 8 కేసులలో నిందితునిగా ఉన్నప్పటికీ తన కార్యకలాపాలను మార్చుకోనప్పటికీ కుంటయ్యపై వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచినట్లు తెలిపారు. అయినప్పటికీ అతను నేర కార్యకలాపాలను కొనసాగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండటంతో కుంటయ్యపై పీడీ యాక్ట్ అమలు చేశారని, ఇట్టి ఉత్తర్వులను అందజేసి చర్లపల్లి జైలుకు తరలించామని ఆయన తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బోడ సాయికుమార్ పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్యకు యత్నించాడని స్థానికులు తెలిపారు. గ్రామంలోని సాయికుమార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. బుధవారం ఉదయం తన స్నేహితులతో కలిసి విందు చేసుకున్నారని చెప్పారు. అనంతరం తాను పురుగుల మందు తాగుతున్నానని పేర్కొంటూ సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసి మిత్రులకు వాట్సప్‌లో పోస్టు చేశాడని పేర్కొన్నారు. గ్రామ శివారులోకి చేరుకున్న స్నేహితులు సాయికుమార్‌ను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని తెలిపారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నిర్ధారించారని పేర్కొన్నారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియడం లేదని చెప్పారు. ఈ విషయంపై ఎస్ఐ రమాకాంత్‌ను వివరణగా తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో ఏడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: బాలికను కిడ్నాప్ చేసి అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో వేములవాడ పట్టణానికి చెందిన ఎర్రం సాయి కిరణ్‌కు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత బుధవారం తీర్పు ఇచ్చినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. అక్టోబరు 7,2016న ఓ బాలికను సాయికిరణ్ కిడ్నాప్ చేసి అసభ్యంగా ప్రవర్తించడంతో ఫోక్సో కేసు నమోదైనట్లు సీఐ తెలిపారు.

బొగ్గు రంగ సంస్థలను నాశనం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

- 16న జరిగే సమ్మెను విజయవంతం చేయండి
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

గోదావరిఖని, ఫిబ్రవరి 7: బొగ్గు రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆరోపించారు. బుధవారం గోదావరిఖని చౌరస్తాలోని శ్రామిక భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహజ సంపద అయిన బొగ్గు బ్లాకులను కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అమ్మకానికి పెట్టిందని, అందులో భాగంగానే సింగరేణిలోని నాలుగు బొగ్గు బ్లాకులను ఈ వేలం ద్వారా గుత్తేదార్లకు అమ్మడం కోసం ప్రయత్నాలు సాగిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారమైన సింగరేణిని కాపాడడం కోసం ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. దేశంలోని 160బొగ్గు బ్లాకులను అంబానీ, అదానీలకు అమ్ముతున్నారని, ప్రభుత్వరంగ ఆస్తులను కాపాడుకోకపోతే దేశంలోని పేదరికాన్ని నిర్మూలించలేమన్నారు. పదేళ్ల కాలంలో దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని నరేంద్ర మోదీ అమ్మకానికి పెట్టి అందులో పని చేస్తున్న కార్మికులను రోడ్డున పడవేశారని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పకపోతే రానున్న రోజుల్లో దేశం సర్వనాశనం అవుతుందని, దీన్ని ప్రజలు, కార్మికులు, కర్షకులు గుర్తుంచుకొని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి, ఎర్రవెల్లి ముత్యం, ఉల్లి మొగిలి, ప్రవీణ్‌కుమార్, వెంకన్న, రాజేశం, శ్రీహరి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

సూక్ష్మ కళాకారుడికి మూడు ప్రపంచ రికార్డులు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలోని తులసీనగర్‌కు చెందిన డాక్టర్ గుర్రం దయాకర్ అనే సూక్ష్మ కళాకారుడు తన ప్రతిభను చాటుతున్నాడు. మూడు ప్రపంచ రికార్డులు పొంది జగిత్యాల పేరును కీర్తికెక్కించాడు. అయోధ్య రామ మందిర ప్రతిష్ఠ పర్వదినాన్ని పురస్కరించుకుని అద్భుతమైన రామమందిర సూక్ష్మ కళారూపాన్ని తయారుచేసి అబ్బురపరిచాడు. 60 గంటల పాటు కష్టపడి 60 వేలకు పైగా బియ్యపు గింజలు ఉపయోగించి తయారు చేసిన విగ్రహానికి మూడు ప్రపంచ రికార్డులు దక్కాయి. భారత్ వరల్డ్ రికార్డ్స్, టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు దయాకర్ ప్రతిభను గుర్తించారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో మూడు ప్రపంచ రికార్డులకు సంబంధించిన సర్టిఫికెట్లను ప్రముఖ సినీ నటుడు బాబూమోహన్ చేతుల మీదుగా అందజేశారు.


ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న దయాకర్

15న జేఎల్‌ఎం సర్టిఫికెట్ల వెరిఫికేషన్

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 7 : ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 15న గురువారం జేఎల్‌ఎం 5వ విడత జాబితా నియామకం కొరకు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, పోలు ఎక్కించే పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. ఈ పరీక్షలు నియామక కమిటీ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరి జాబితాను వారి చిరునామాకు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపనున్నట్లు తెలిపారు. ఎవరికైనా లెటర్ ముట్టకపోతే ఎస్ఈ కార్యాలయంలో వారి ఐడీ కార్డు చూపించి కాల్ లెటర్లు పొందవచ్చని తెలిపారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 7: ఉమ్మడి జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 10న నిర్వహించనున్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం 10 నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు హ్యాండ్‌బాల్ సంఘం సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్‌లకు మైదానంలో రిపోర్టు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94419 25807 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 21 వరకు అవకాశం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 7: ఉమ్మడి జిల్లాలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలు పొందిన విద్యార్థులు పది, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసేందుకు ఈ నెల 12 నుంచి 21లోగా పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ప్రతి సబ్జెక్టుకు 100, ఇంటర్మీడియట్ విద్యార్థులు రూ.150, ప్రాక్టికల్స్‌కు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఒక్కో సబ్జెక్టుకు 25 రూపాయల అపరాధ రుసుముతో ఈ నెల 27వ తేదీ వరకు, రూ.50 తో మార్చి 4వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు.

పోలీసు కస్టడీకి భూకబ్జా నిందితులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 7: నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి అక్రమంగా భూకబ్జాలకు పాల్పడిన కేసులో వారం రోజుల నుంచి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న తీగల గుట్టపల్లి మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్య, గుంజ లక్ష్మణ్‌లను బుధవారం కరీంనగర్ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నకిలీ ధ్రువ పత్రాలు, నకిలీ స్టాంపులతో ఆరెపల్లి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో కొమ్ము భూమయ్య, గుంజ లక్ష్మయ్యను ఈ నెల 1న పోలీసులు అరెస్టు చేసి జైలు తరలించారు. జైలులో రిమాండ్‌లో ఉన్న ఇద్దరిని మరింత లోతుగా విచారించేందుకు రెండు రోజుల కిందట పోలీసులు కరీంనగర్ కోర్టులో కస్టడీ పిటిషన్ వేయగా ఒక రోజు కస్టడీకి అనుమతి లభించింది. ఈ మేరకు భూమయ్య, గుంజ లక్ష్మన్‌లను ఉదయం 10 గంటలకు కస్టడీకి తీసుకుని మొదట విచారణ అనంతరం తీగలగుట్టపల్లిలోని ఇద్దరి ఇళ్లలో సోదాలు జరిపారు. ఈ సోదాల్లో అక్రమ భూకబ్జాలకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లు, నకిలీ స్టాంపులు, నకిలీ ధ్రువపత్రాలు లభించినట్లు తెలిసింది. ఈ డాక్యుమెంట్లను భూమయ్య ముందుంచి మరింత సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. నకిలీ స్టాంపులు, ధ్రువపత్రాల తయారీకి సహకరించిన వారి వివరాలతోపాటు ఎవరెవరి భూములు కబ్జాచేసింది, కబ్జాకు ప్రయత్నించిన వివరాలను రాబట్టినట్లు సమాచారం. భూమయ్య తీగలగుట్టపల్లి ప్రాంతంలో కూడా పలువురి ఇళ్ల స్థలాలను కబ్జా చేశాడని ఆరోపణలు వచ్చాయి.

- భూకబ్జా, బెదిరింపులు, దౌర్జన్యానికి సంబంధించిన ఐదు కేసుల్లో జనవరి 24న అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న సీతారాంపూర్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను పోలీసులు బుధవారం రెండోసారి కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. అరెస్టు అయిన సాగర్‌పై ఇప్పటికే రౌడీషీట్ తెరిచారు. ఫిబ్రవరి 1న మొదటిసారి కస్టడీ తీసుకుని విచారించారు.

కబ్జా స్థలాలు బాధితులకు అప్పగింతపై విచారణ

కిసాన్‌నగర్‌లో ఒక నాయకుడు తన వద్దకు భూ వివాదం పరిష్కరించాలని వచ్చిన పలువురి స్థలాలను కబ్జా చేశాడని 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన కథనంపై కరీంనగర్ స్పెషల్ బ్రాంచి పోలీసులు రంగంలోకి దిగి విచారణ జరుపుతున్నారు. ఆ నాయకుడు ఎవరు? బాధితులు ఎవరనేది విచారణ జరుపుతున్నారు. పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లకుండా భూములు కబ్జా చేసిన వ్యక్తి బాధితులతో మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. 8 మంది బాధితుల్లో నలుగురు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

దేశ వ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు

కోరుట్ల, ఫిబ్రవరి 7: కేంద్ర ప్రభుత్వం అను సరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాల ను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టే దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను కార్మి కులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సు తారి రాముల కోరారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ అవరణలో కార్మికులతో కలిసి బంద్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి 9 సంవత్సరాలు గడిచినప్పటికీ కార్మికుల ప్రయోజ నాలకు ఏమి చేయలేదన్నారు. దేశ వ్యాప్త, గ్రామీణ భారత్ బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో కార్మిక నాయకులు ఉస్మాన్, చిట్యాల రాజ్‌కుమార్, తెద్దు సాయి, రాగుట్ల సాయి కుమార్, గంగారాం, సుగుణ, నరిసింహులు, రవి, రమేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ

మెట్‌పల్లి, ఫిబ్రవరి 7: సైబర్ నేరాలు, భద్రతపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు సైబర్ నేరాల నియంత్రణ ప్రతీ నెల మొదటి బుధవారం సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం కాలంలో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాను ఎక్కువగా విద్యార్థులు, చిన్నారులు వాడుతున్నారన్నారు. సైబర్ నేరాలకు గురి అయిన వారు వెంటనే 1930కి కాల్ చేసిన వివరాలను తెలియజేయాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై చిరంజీవి, కళాశాల ప్రిన్సిపాల్ బిల్లా రాజేందర్, ఎన్ఎస్ఎస్ అధికారి వెంకయ్య, అధ్యాపకులు మనోజ్ కుమార్, మధు బాబు, గట్టయ్య, అంజయ్య పాల్గొన్నారు.

కథలాపూర్: సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పబ్బ కిరణ్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు ఏటీఎం, పేటీఎం, ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లకు సంబంధించి ఓటీపీలు చెప్పవద్దన్నారు. గుర్తు తెలియని వారి నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. అనవసరంగా తమ బ్యాంకుల నుంచి డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. ప్రిన్సిపాల్ రహమాన్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

సామాజిక కార్యక్రమాలు అభినందనీయం

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



ప్రశంసాపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 7: సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినంనీయమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. బుధవారం మండలంలోని అయి లాపూర్‌లో కోరుట్ల వెటర్నరీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా వ్యాప్త గ్రామీణ ప్రాంతాల ఎన్ఎస్ఎస్ శిబిరాల ముగింపు కార్యక్రమాన్ని కళాశాల డీన్ డా. మాధవరావు ఆధ్వర్యంలో నిర్వ హించంగా ఎమ్మెల్యే డాక్టర సంజయ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. శిబిరం లో పాల్గొన్న మెడికోలు, ప్రొఫెసర్, కళాశాల సిబ్బందికి ప్రశంస పత్రాలను అందించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో వెటర్నరీ శిబరాలను నిర్వహించి పశువుల యజమానులకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిడుగు రాధ - సందయ్య, ఎంపీపీ తోట నారాయణ, మాదాపూర్ మాజీ సర్పంచ్ దారిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి బూత్‌ల వారీగా కార్యక్రమాలు

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 7: బీఎస్పీ బలోపేతానికి బూత్ కమిటీలు కార్యక్రమాలను చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజక వర్గం ఇన్‌చార్జిలుగా గొర్రె భీమన్న, మారంపల్లి శ్రీధర్, అధ్యక్షుడుగా గోరుమంతుల ప్రభాకర్, ఉపాధ్యక్షుడుగా గన్నారపు విక్రమ్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా రాంపల్లి బాలరాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శనిగారపు ప్రశాంత్, కోశాధికారిగా సామల్ల కళ్యాణ్‌లను నియమించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ కార్యక్రమాలను చేపట్టాలని పలు సూచనలు చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు బోనగిరి అమర్, నాయకులు అక్కవత్తుల నరేష్ ప్రశాంత్, రమేష్, నవీన్, తాండ్ర గంగాధర్ పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

రాయికల్, ఫిబ్రవరి 7: మండలంలోని తాట్లవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ రెండో రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్నామని, ఈ సభల్లో అంతరాలు లేని విద్య, ప్రజల హక్కు-ప్రభుత్వ బాధ్యత, అసమాన సమాజంలో సమానత్వ విద్య-సాధ్యాసాధ్యాలు, ఫాసిజం-బుద్ధి జీవుల పాత్ర, మహిళ స్థితిగతులు-కర్తవ్యాలులాంటి అంశాలపై ప్రముఖ వక్తలు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఉపాధ్యాయు లు, విద్యాభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, లావణ్య, సాగరిక, శ్రీధర్, శ్రీదేవి, చంద్రకళ, రవి కుమార్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 7: బీసీ సంక్షేమ శాఖ, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కోరుట్ల నియోజక వర్గంలోని సమస్యలను పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. బుధవారం మంత్రిని హైదరాబాద్‌లోని సచివాలయంలోని ఆయన చాంబర్‌లో కలిసి నియోజక వర్గంలోని సమస్యల గురించి తెలుపగా సానుకులంగా స్పందించినట్లు తెలిపారు. అదే విధంగా నియోజక వర్గంలోని అభివృద్ధి పనులను చేపట్టాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈయన వెంటా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, గడ్డం సాయిరెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, నాయకులు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించాలి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 7: ప్రభుత్వ ఆసపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆదేశించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన గర్భిణీ శస్త్ర చికిత్సలో ఎదుర్కొన్న సమస్యను బుధవారం గ్రామస్థులు కోరుట్ల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించిన సమయంలో బాలింత ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యను అడిగి తెలుసుకొని వైద్యులకు పలు సూచనలు చేశారు. రోగుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా మంచి వైద్యం అందజేయాలని వైద్యులను ఆదేశించారు.

వైభవంగా అఖండ హనుమాన్ చాలీసా పారాయణం

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 7: అయోధ్య బాలరాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని లోక కళ్యాణార్థం జగదాలయ ఆధ్యాత్మిక బృందం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వాసవి గార్డెన్ నిర్వహిస్తున్న అఖండ హనుమాన్ చాలీసా పారాయణం రెండోరోజు బుధవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. భారతీ తీర్థ పురస్కార గ్రహీత బాచంపెల్లి సంతోష్‌కుమార్ శాస్త్రీ హాజరై భక్తులకు ప్రవచనాలు వినిపించారు. అనంతరం హనుమాన్ ధ్వజ ప్రాణ ప్రతిష్ఠ, లక్ష తమలపాకుల అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కోటగిరి శ్రవణ్ కుమార్, చెట్ల చంద్రశేఖర్, మార కైలాసం, బోనగిరి రామనారాయణ, తవుటు రాంచంద్రం తదితరులు ఉన్నారు.

సమస్యలు గుర్తించి సత్వర పరిష్కారం

14వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం
కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



అల్లీపూర్‌లో శ్రమదానంలో పాల్గొన్న అధికారులు

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 7: పారిశుద్ధ్యంపై ఇంటింటికి అవగాహన కల్పిస్తూ, తాగునీటి సమస్యలు ఉంటే వాటిని గుర్తించి అధికారులు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్ ఎస్సీవాడలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 14వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. దీని కోసం స్పెషల్ ఆఫీసర్లను, పంచాయితీ సెక్రెటరీలను నియమించామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సహకారం, మహిళ సంఘాలు, యువత సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పారిశుద్ధ్యంపై ఇంటింటికి అవగాహన కల్పిస్తూ, తాగునీటి సమస్యలు ఉంటే వాటిని గుర్తించి అధికారులు సత్వరపరిష్కారం చూపాలన్నారు. ప్రతీ గ్రామంలో ప్రభుత్వ భూములను గుర్తించి చెట్లు నాటాలని సూచించారు. రానున్న రోజుల్లో పారిశుధ్యం, మంచినీటి సరాఫరాలో ఎక్కడ ఇబ్బందులు లేకుండా చూస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు, ఎంపీడీఓ శైలజారాణి, ఎంపీవో సలీం, అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభించారు. చల్‌గల్ గ్రామంలో డీపీవో దేవరాజు, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవి బాబు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. మోరపల్లి గ్రామంలో ప్యాక్స్ ఛైర్మన్ మహిపాల్‌రెడ్డి, వెటర్నరీ డాక్టర్ నరేష్, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు.

రాయికల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ అన్నారు. మండలంలోని అల్లీపూర్, భూపతిపూర్ గ్రామాల్లో గ్రామస్థులు, మహిళలతో కలిసి శ్రమదానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీవో సుష్మా, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, రాయికల్ మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్, యూత్ కాంగ్రెస్ నాయకులు జక్కుల సాగర్, విష్ణు, హరీష్, ఏఎన్ఎం జలజ పాల్గొన్నారు.

ధర్మపురి: మండలంలోని గోవింద్‌పల్లె, నేరెళ్ల, కమలాపూర్ తదితర గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణచైతన్య, డిప్యూటీ తహసీల్దార్ సుమన్ సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య ర్యాలీ నిర్వహించారు. పలు చోట్ల గ్రామస్తులు, యువకులు, మహిళలతో కలిసి శ్రమదానం చేయించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేంద్రప్రసాద్, మండల ఎంపీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు రెడ్డవేని సత్యం, పీఏసీఎస్ వైస్‌ఛైర్మన్ షేర్ల రాజేశం, మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మల్యాల: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించారు. గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది తదితరులు గ్రామస్థులతో కలసి పారిశుధ్యంపై వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాలలో ఎంపీడీవో వెంకటేషం, అధికారులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో మురికి కాలువలను, పారిశుద్ధ్య పనులను ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. గుర్తించిన ప్రజా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రత్యేకాధికారులు పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ప్రత్యేకాధికారులు సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో



కొడిమ్యాలలో శుభ్రం చేస్తున్న అధికారులు

తహసీల్దార్ మహ్మద్ ఆరిఫొద్దీన్, ఎంపీడీవో నవీన్ కుమార్, ఏవో కరుణ, ఎంపీవో సురేష్ రెడ్డి, ఎంఈవో జమునాదేవి, మండల వైద్యాధికారి నరేష్, మండల పశు వైద్యాధికారి రవీందర్, ఏటీఎం త్రివేణి, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది తదితరులు గ్రామస్థులతో కలసి పారిశుధ్యంపై వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాలలో ఎంపీడీవో జె పుల్లయ్య, తహసీల్దార్ ఎంఎ ఫారూక్, ఎంపీవో మహేందర్, నాయబ్ తహసీల్దార్ విష్ణువర్ధన్, వివిధ శాఖల అధికారులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని వివిధ గ్రామాల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ ప్రశాంతి, ప్రత్యేక అధికారులు ప్రతాప్ సింగ్, ఎంపీడీవో పద్మజారాణి, తహసీల్దార్ రవికాంత్, ఎంపీవో ప్రవీణ్, కార్యదర్శులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: గ్రామాలో పారిశుద్ధ్య పనులను సక్రంగా నిర్వహించాలని ఎంపీపీ తోట నారాయణ అన్నారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనుల కార్యక్రమాలను నిర్వహించి అంటు వ్యాధులు సోకకుండా అవగాహన ర్యాలీలను నిర్వహించారు. వెంకటాపూర్‌లో నిర్వహించిన పారిశుధ్య పనులను ప్రారంభించి అవగాహన ర్యాలీలో ఎంపీపీ తోట నారాయణ పాల్గొన్నారు. మాదాపూర్‌లో జడ్పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్య- రాజేష్, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో నీరజ, మండల వ్యవసాయ అధికారిణి నాగమణి, మండల విద్యాధికారి నరేశం పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు మొగిలిపేట, వేంపల్లి, వెంకట్రావుపేట, సిర్పూర్ తదితర గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టి శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



దరూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్

కథలాపూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళా సంఘాలు, యువకులు, ప్రజాప్రతినిధులు కలిసి పాదయాత్ర నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టబోయే పనులను గుర్తించారు. ప్రత్యేక సిబ్బందితో కలిసి శ్రమదానంతో గుంతలను పూడ్చారు. మురికి కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో జనార్దన్, తహసీల్దార్ ముంతాజీబోద్దీన్, ప్రత్యేక అధికారులు ఉన్నారు.



మల్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

● పారిశుధ్య పనులను నిరంతరం చేపట్టాలి..
కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్: గ్రామాల్లో పారిశుధ్య పనులను నిరంతరం చేపట్టాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అధికారలను ఆదేశించారు. బుధవారం మండలంలోని జగ్గసాగర్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఎంపీపీ మారు సాయిరెడ్డితో కలిసి ప్రారంభించారు. చీపుర్లు పట్టి వీధులను శుభ్రం చేసి చెత్తను పంచాయతీ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆత్మనగర్, చింతలపేటతో పాటు పలు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బోగ వందన-గంగాధర్, నాయకులు పుల్ల జగన్‌గౌడ్, ముదాం రాజేష్, ముదాం నర్సింహులు, డాకూరి వెంకటేష్, గడ్డం రాజారెడ్డి, డీటీ రాజ్‌మొహ్మద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

● గుడ్ మార్నింగ్ కోరుట్ల కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పర్యటించారు. మురికి కాలువలు, రోడ్లు, పీహెచ్‌సీ, ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని ఆయా శాఖల అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ అంజిత్‌రెడ్డి, కార్యదర్శి ప్రశాంత్, ఏఎన్ఎంలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



జగ్గసాగర్‌లో చెత్తను ఎత్తుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాయికల్, ఫిబ్రవరి 7: జాతీయ సైన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయికల్ మండలంలోని విద్యార్థులకు బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయిలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. నీటి సంరక్షణ, ప్లాస్టిక్ నిషేదం, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై వ్యాస రచన, ఉపన్యాస, క్విజ్‌పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఉపన్యాసంలో బొడ్డుపల్లి రక్షిత (భూపతిపూర్ ఉన్నత పాఠశాల), పెయింటింగ్‌లో ఎం హంపి (రాయికల్ బాలికల ఉన్నత పాఠశాల), కవిత్వంలో పి లాస్యప్రియ (ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ పాఠశాల)లు ఈ నెల 10న జగిత్యాలలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పొన్నం రమేష్, బొల్లె చిన్నయ్య, పద్మ, రాపర్తి నర్సయ్య, విజయ్ కుమార్, గిరిధర్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని మండల విద్యాధికారి బత్తుల భూమయ్య సూచించారు. జాతీయ సైన్స్ డే సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు మండలస్థాయి పోటీలు నిర్వహించారు. కవితల పోటీలో చెగ్యాం ఉన్నత పాఠశాల విద్యార్థిని స్పందన, ఉపన్యాస పోటీలో కె శ్రావణి, చిత్రలేఖనంలో వెల్గటూర్ హైస్కూల్ విద్యార్థిని కె ఆదిత్య, పాటల పోటీలో ముత్తునూర్ హైస్కూల్ విద్యార్థిని కె అంజలి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

బుగ్గారం: బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండలస్థాయి పోటీలు నిర్వహిం చారు. చిత్రలేఖనంలో జి రిశ్వంత్ వెల్గొండ, కవితల పోటీలో బి వర్షిణి మద్దునూర్, పాటల పోటీలో లక్ష్మీప్రసన్న మద్దునూర్, ఉపన్యాస పోటీలో శ్రీపాద ఆశ్రిత మద్దునూర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. హెచ్ఎంలు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, జీవన్‌కుమార్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీల అమలుపై పోరాటం చేద్దాం

- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ధర్మపురి, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ సర్కార్ హామీల అమలుపై పోరాటం చేద్దామని, కేసీఆర్ తెలంగాణ స్ఫూర్తిని చూపిద్దామని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి బుధవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ అంతులేని హామీలు ఇచ్చిందని, వాటిని నెరవేర్చడం కోసం మల్లగుల్లాలు పడుతోందని ఆయన దుయ్యబట్టారు. పైసా అప్పు లేకుండా అభివృద్ధి ఎలా సాధ్యమో రేవంత్‌రెడ్డి నిరూపించాలని సవాల్ విసిరారు. ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించాలనేది కనీస చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా కేఆర్ఎంబీపై కాంగ్రెస్ వ్యవహరిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ తప్పులను ఎండగడతామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు సత్తా చాటాలని, అధిక మెజార్టీ తీసుకరావడం కోసం కృషి చేయాలని ఆయన కోరారు.

● కేసీఆర్ ఉద్యమం వల్లే తెలంగాణ: కొప్పుల

కేసీఆర్ ఉద్యమం చేయకపోతే తెలంగాణ వచ్చేదా అని రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ పని చేయలేకనే కేసీఆర్‌పై నిందలు మోపుతోందన్నారు. సీఎంగా పదేళ్ల కాలంలో కేసీఆర్ రాష్ట్రంలో అద్భుతమైన ప్రగతి సాధించారన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీల అమలుపై వంద రోజుల తరువాత బీఆర్ఎస్ శ్రేణులు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సభ్యసమాజం సహించదన్నారు. బీఆర్ఎస్ అధినేత నిర్ణయించిన అభ్యర్థిని పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఆయన అన్నారు. అనంతరం ఇటీవల ప్రమాదాల్లో మృతి చెందిన పాదం శ్రీకాంత్, ఆత్మకూరి స్వామి, బండారి చిన్నశాంతమ్మ కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ పక్షాన పరిశీలకులు మదుసూధనాచారి, మాజీ మంత్రి ఈశ్వర్, దావా వసత చేతుల మీదుగా రూ 2,00,000 చొప్పున చెక్కులు అందించారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ దావా వసంత, డీసీఎంఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ ఛైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఎంపీపీలు ఎడ్ల చిట్టిబాబు, కూనమల్ల లక్ష్మి, నక్క శంకరయ్య, గోలి శోభ, జడ్పీటీసీలు బత్తిని అరుణ, గోస్కుల జలంధర్, పున్కూరి పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 7: 2024-25 విద్యా సంవత్సరానికి గానూ బెస్ట్ అవైలబుల్ స్కూల్ (రెసిడెన్షియల్-నాన్ రెసిడెన్షియల్) పథకంలో భాగంగా ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేయడానికి, జిల్లాలోని ప్రైవేట్ ఆంగ్లమాధ్యమ పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఇందుకు గానూ బెస్ట్ అవైలబుల్ స్కూల్ రెసిడెన్షియల్ పథకంలోని విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ వసతి, భోజన వసతితో పాటు రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలకు గానూ ప్రతి విద్యార్థికి రూ.42వేల చొప్పున, నాన్ రెసిడెన్షియల్ పథకం విద్యార్థులకు ట్యూషన్‌తో పాటు, రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్‌లకు గానూ రూ. 28వేలు చెల్లించబడునని తెలిపారు. దరఖాస్తు ఫారాల కోసం ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం రూం నెం(128) రెండో అంతస్తు నందు సంప్రదించాలని కోరారు. పూర్తి చేసిన దరఖాస్తుల ఫారాలను ఈ నెల 29వరకు మాత్రమే స్వీకరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని జగిత్యాల జిల్లాలోని ప్రైవేట్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మ దహనం



అర్వింద్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 7: అర్వింద్ కో హటావో- బీజేపీకీ బచావో అనే నినాదమే ఎజెండాగా బీజేపీ సీనియర్ స్థానికుల ఆధ్వర్యంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ దిష్టిబొమ్మను జిల్లా కేంద్రంలోని స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అహంకార పూరిత ధోరణితో, ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెద్దు పోకడలతో ముందుకు వెళ్తున్న ఎంపీ అర్వింద్ తీరును జగిత్యాల నియోజకవర్గం పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకొని పనిచేసిన కార్యకర్తలను, నాయకులను విస్మరిస్తూ, ప్రశ్నిస్తే సస్పెండ్‌లు చేయిస్తూ, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అర్వింద్‌కు తప్ప పార్టీలో ఇతర ఏ సీనియర్‌కైనా పార్టీ టికెట్ ఇవ్వాలని రాష్ట్ర పార్టీకి కార్యకర్తలు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చీటి శేఖర్‌రావు, ఠాకూర్ విద్యాసింగ్, ఎద్మల వెంకట్రాజం, లింగాల శ్రీకాంత్‌రావు, బావేటి శ్రీనివాస్, గోగికార్ మహేందర్, గట్టుపెల్లి జ్ఞానేశ్వర్, జైనపురం రమేష్, మామిడి శేఖర్, కాసారపు శ్రీనివాస్ ఉన్నారు.

● ప్రజాప్రతినిధులకు అహంకారం పనికిరాదు..

ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిదులకు అహంకారం పనికిరాదని, పార్టీని అంటిపెట్టుకుని ఉండే కార్యకర్తలు, నాయకులను విస్మరించడం తగదని బీజేపీ రాష్ట్ర నాయకులు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంఛార్జ్ అల్జాపూర్ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధాంతం కోసం, జాతీయ భావం కోసం పనిచేసే నాయకులను ఎప్పటికైనా పార్టీ అధిష్ఠానమే గుర్తిస్తుందన్నారు. పార్టీ ఎప్పటికైనా కార్యకర్తలన కాపాడుకుంటుందని భరోసానిచ్చారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు, నాయకులు సీపెల్లి రవీందర్, ఎద్మల వెంకన్న, నా రాయణరెడ్డి, విద్యాసింగ్, ఠాకూర్ కిషోర్ సింగ్, మాడిశెట్టి మల్లేశం, కాసారపు శ్రీనివాస్, ఎర్ర శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

మెట్‌పల్లి: నియోజక వర్గంలోని వివిధ రకాల్లో నిలిచిన లబ్ధిదారుల చెక్కులను త్వరలోనే అందజేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను అందజేశారు.

టీర్‌పూర్: మండలంలోని కందెనకుంటలో ఏదుల నర్సయ్యకు చెందిన ఎద్దు బుధవారం ఉదయం విద్యుదాఘాతంతో మృతి చెందింది. విషయం తెలుసుకు న్న ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేసుకొని మృతి చెందిన ఎద్దును పరిశీలించి పై అధికారులకు నివేదించారు.

బుగ్గారం: బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల సమయంలో అందజేసేలా కాంగ్రెస్ నాయకులు బుధవారం ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డికి 6300 రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నర్సగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దనవేని శంకర్, రాజన్న, అంజిత్ కుమార్, శ్రీనివాస్, లింగన్న, శంకర్, మహేష్, కైలాసం, షరీఫ్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులు వీడ్కోల్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల్లోని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు తల్లిదండ్రులను, గ్రామస్థులను అలరించాయి.

మెట్‌పల్లి/మెట్‌పల్లి రూరల్/మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కొమిరెడ్డి కరంచంద్ జన్మదిన వేడుకలు నాయకులు మెట్‌పల్లి పట్టణంలో, మండలంలో, మల్లాపూర్ మండలం మొగిలిపేట, రేగుంటలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. పల్లికొండ ప్రవీణ్, బాశెట్టి హరిష్, సురభి అశోక్, ఎండి రైసొద్దీన్, మహ్మద్ మెహబూబా, అలీ ఎస్కే సాదిక్, వరద సురేష్, నిమ్మల జలంధర్‌రెడ్డి, పండుగుల సంజీవ్, సామ మోహన్‌రెడ్డి, నేరెళ్ల రాజిరెడ్డి, ముడంపల్లి శేఖర్ పాల్గొన్నారు.